

# ఆకాశం ఏనాటిదో...

నీరజ జవ్వాజి

"**2-12-1993 ...** సంవత్సరం క్రితం ఇదే రోజు నువ్వు ఆఫీను పని ఉందంటూ ఊరెళ్లావు. అప్పటినుంచీ నీ కోసం ఇలా ఎదురు చూస్తూనే ఉన్నాను. అల్లిబిల్లి తిరుగుతూ, కోతి కొమ్మచ్చులాడుకునే రోజుల్లోనే నువ్వు నన్ను అపురూపంగా చూసుకున్నావు. బిళ్లంగోడు, గోటీలు ఆడుతున్నా నని అమ్మమ్మ నన్ను మగరాయుడి నంటూ మందలిస్తే, 'నాకు ఈ మగరాయు డంటేనే ఇష్టం. దీన్నే నేను పెళ్లి చేసుకుని వంట చేసిపెడతా' ననేవాడివి. ఆ రోజుల్లో ఆ మాటలకు అర్థం పూర్తిగా తెలియకపోయినా నే నంటే నీ కిష్టమని అర్థమయ్యేది.

"స్కూల్లో ఏడవ తరగతిలో ఉన్నప్పుడు రాము, వాడి స్నేహితులతో కలిసి ఆకతాయిగా న న్నేడిపించా డని గొడవపడి దెబ్బలు తిన్నావు. హాస్పిటల్‌లో అవస్మారకంగా ఉన్న నిన్ను చూసి ఏడుస్తూ అమ్మమ్మ 'నా మనవడిని ప్రశాంతంగా ఉండనీయవే' అని కోపంగా తిట్టినప్పుడు - చిత్రం - నాకు కళ్లవెంట నీళ్లు రాలేదు. అప్పుడప్పుడే అర్థమయ్యీ, మనసుని ఉద్రూతలూగించే నీ ప్రేమ తట్టుకోలేక ఆనంద బాష్పాలొచ్చాయి.

"వయసు పెరిగి సొగసు దాచుకునే ప్రయత్నంలో ఓణీల సాయం తీసుకునే రోజుల్లో ఓ శరత్‌కాలపు సాయంత్రం చిరుచీకట్లు కమ్ముకుంటున్నాయి. వెన్నెల జల్లులు కురిపించేందుకు చంద్రుడు సమాయత్త మవుతున్నప్పుడు వేణుగోపాలస్వామి ఆలయంలో భాగవతారు గారు చెప్పే 'రుక్మిణీ కల్యాణం' హరి కథ వింటూ, 'ఇంట్లో ఒప్పుకుంటే సరే, లేదూ ని న్నలా రుక్మిణిలా ఎత్తుకెళ్లి గాంధర్వ వివాహం చేసుకుంటా'నంటూ నువ్వు కన్ను గీటినప్పుడు నా హృదయం ఆలపించిన హంసధ్వని రాగం నీకు వినిపించనే లేదు.

"కొత్త కొత్త ఆలోచనలు ... మధురమైన ఊహలు మొగ్గ తొడిగే వరువంలో నిన్ను చూస్తే మనసు ఉలిక్కిపడేది. నడక తడబడేది. వయసు త్వరపడేది. కానీ నీ ముందు బయటపడటం ఇష్టం లేక తల వంచుకుని అన్ని ఆర్భాటాలు, నాలోనే దాచుకునేదానిని. అంతలోనే నువ్వు చదువుకోసమంటూ దూరంగా వెళ్లిపోయావ్! నువ్వు ... నీతో ఆలయం గంటల చప్పుడు, వెన్నెల వెలుగులు, కోనేటి నీటి పాటలు ... అన్నీ నీతోనే మూటగట్టుకుని తీసుకెళ్లిపోయావ్!

"ప్రతి క్షణం నీకోసం వెర్రిగా ఎదురు చూసి వేణుగోపాలస్వామిని వేడుకునేదానిని - నువ్వు త్వరగా రావాలని. వేకువనే లేచి వాకిలంతా రంగవల్లులతో తీర్చిదిద్ది నువ్వు నడిచి వచ్చే దారంతా పొన్నాయిలు వరిచి దారి చివర దీపంతో ఎదురు చూసేదానిని.

"అదిగో! అప్పుడు వచ్చిం దది - దీపాన్ని ఆర్పేస్తూ, పూలను నలిపేస్తూ ...

“ ‘మనోజ్ వెడ్స్ రాధిక’

“పెళ్లి కార్డుతోపాటు, ‘కారణాంతరాల వల్ల ఈ అమ్మాయిని వివాహం చేసుకోవలసివచ్చింది. నీ మనసు నాకు తెలుసు. కానీ నువ్వు తప్పక అర్థం చేసుకుంటావనే ధైర్యంతో ఈ అడుగు వేస్తున్నాను. తప్పక వస్తావు కదూ! మిగిలిన విషయాలు ఇక్కడికి వచ్చిన తర్వాత మాట్లాడుకుందాం. నానమ్మకి నువ్వే నచ్చచెప్పి తీసుకురావాలి’ అన్న ఉత్తరం నన్ను వెక్కిరించింది.

“అది చదివి ఇంట్లోకి ఎలా వెళ్లానో, ఏం జరిగిందో అర్థం కాలేదు. కానీ కళ్లు తెరిచినప్పుడు నవ్వుతూ నిల్చున్న అమ్మమ్మే కనిపించింది.

“పిచ్చిపిల్లా! ఇంతేనా నీ ధైర్యం! వా డేదో ఆకతాయిగా చేస్తే ఆలోచించకుండా ఇలా అయిపోతావా? చూడు నిన్నటి నుండి ఇలా తెలివి లేకుండా పడుంటే నాకు కాళ్లూ చేతులూ ఆడలేదు. ఏప్రిల్ ఫస్టన ఏడిపిద్దామని ఆ ఉత్తరం రాశాడట! నీకిలా అయిందని తెలిసి పరుగెత్తుకొచ్చాడు. చూడు, వాడు ఇక్కడే ఉన్నాడు. నీకు ముఖం చూపించలేక ... అయినా మీ ఇద్దరూ ఒకరి కోసం ఒకరు పుట్టినవాళ్లు. మిమ్మల్ని దేవుడు కూడా వేరు చేయలేడు - అంటున్న అమ్మమ్మ నుండి నీ వైపు దృష్టి మరల్చాను.

“కదిలిస్తే ఏడ్చేటట్లున్న నీ ముఖం చూస్తే నా బాధంతా మాయమైంది. ‘ఏడవకు ఏడవకు వెర్రి పాపాయీ! ఏడిస్తే నీ కళ్లు నీలాలు కారు! పాలైన కారవే బంగారు కనులా!

“నీ చదువు అవగానే ఉద్యోగం రావటం, పెళ్లికి ముహూర్తాలు పెట్టుకోవడం వెంటవెంటనే జరిగిపోయాయి.

“అబ్బా! ఇన్ని రోజులుగా వీడు తపించిపోతున్న ఈ భామ్మని చూసే భాగ్యం ఇప్పుడు కలిగింది. కనీసం ఫోటో అయినా ఎందుకు పంపించలేదో ఇప్పు డర్థమైంది’ అన్న విశ్వనాథ్ మాటలు ...

“నిజమే వెన్నెల, మల్లెలు కలబోసినట్లుంది రేవతి. నిజంగా నువ్వు చాలా అదృష్టవంతుడివి మనోజ్! త నవ్వుడే నాకు మాంచి దోస్తయిపోయింది’ అన్న మాధురి కామెంట్ ...

“రిసెప్షన్‌లో ఎవరూ చూడకుండా నా నడుము మీద అల్లరి శ్రుతి చేసిన నీ చేతి వేళ్లు ... గిలిగింతలతో నేను పకపకా నవ్వుతుంటే వచ్చిన ఆహూతులంతా నన్నే చూడటం ... నిన్నా మొన్నా జరిగినట్లుంది.

“నా జీవితంలో అద్భుతమైన క్షణాలు అరకులోయ, భీమిలీ ఎర్రమట్టి కొండల్లో మనం గడిపిన మూడు రోజులు.

“పచ్చని కొండల మధ్య ప్రయాణం ... రైలు టన్నెల్‌లోకి వెళ్లే ముందు నీ ఆలోచన అర్థమై నేను పక్కకు జరగటం ... నే ననుకుని నువ్వు ఎదురుగా నా పక్కన కూర్చున్న ముసలావిడను ముద్దుపెట్టుకోవడం [అఫ్‌కోర్స్! బుగ్గమీదే నని ఆ తర్వాత నువ్వు చెప్తే తెలిసింది] ... దానికి ఆమె కోపగించుకోక మన సంగతి తెలిసినదానిలా నవ్వి ఒరియాలో ఆశీర్వదించటం ... నీ అలక తీర్చటానికి నేను పడ్డ కష్టాలు ... ఇంకా నా మీద కోపం పోలేదా?

“పనుపారబోసినట్లున్న పూల మధ్య, నాకు కొండంత ధైర్యాన్నిచ్చిన నీ బాహువుల మధ్య గువ్వలా ఒదిగిపోయాను. కానీ ఇప్పు డా బంధం లేదు. ఆ ధైర్యం లేదు.

“ఆ తర్వాత నువ్వు ... నేను ... మనిల్లు ... ఇంటి ముందు పూల జల్లు ... ఇంట్లో నవ్వుల హరివిల్లు ... సౌభద్రుడిలా నువ్వుంటే నీ వత్సలను నేనైపోతూ, కిన్నెరసాని అందాలు ఆస్వాదిస్తూ, కృష్ణశాస్త్రి బాధను శ్వాసిస్తూ ... రోజులు గడిపేస్తుంటే ...

“అప్పుడే నువ్వు పనుందంటూ నన్ను వదిలి దూరంగా వెళ్లావు. ను వ్వెళ్తే నీతో నా ప్రాణం కూడా వెళ్లిందేమోనన్నంతగా ...

“ఇప్పుడొస్తావు ... ఇదిగో ఇప్పుడే వచ్చేస్తావని ఆశల దీపాలు వెలిగించుకుని కూర్చున్నాను. తలుపులకు నా కళ్లు అతికించి ఎదురు చూస్తూ ఉండేదానినా ... వేలవేల పాదాలు చీకటిలో నుండి ఇంటి ముందుకు నడిచి వచ్చేస్తూంటాయి. నువ్వే అనుకుంటానా ... కానీ వెలుగులో కొచ్చేసరికి అవి కొత్త ముఖాలు తగిలించుకుని నన్ను వెక్కిరిస్తూ వెళ్లిపోతాయి.

“ఆశ, నిరాశల వెలుగు చీకట్ల మధ్య నీ ఆలోచనల్లో నన్ను నేను కోల్పోతూ, అంతలోనే నువ్వు రాలేదన్న నిజం గుర్తొస్తే కళ్లు కొల్లేరు లవుతాయి. మళ్లీ ఆశల పడవలు చేసి కళ్లలో నింపుకుంటాను. నీ కోసం ఎదురుచూస్తూ ... నిదుర కాస్తూ ... ఇంకా రావేమి ప్రభూ! నా ముంగిట్లో నవ్వులు, పువ్వులు పూయించటానికి.

“నే నిలా ఉత్తరం రాస్తున్నప్పుడల్లా అమ్మమ్మ ఏడుస్తుంది. ఎందుకో నాకు చెప్పదు. పాపం నాకు నువ్వు గుర్తొచ్చినట్లే తనకీ తాతయ్య గుర్తొస్తున్నాడేమో! మరి నువ్వు త్వరగా వచ్చేయ్! లేదంటే ఏదో ఓ రోజు నేనే నీ దగ్గరకి వచ్చేస్తా!”

** ** **

వెలుగు రేకలు విచ్చుకుంటున్నాయి. సన్నగా వీస్తున్న ఫేన్ గాలికి దిండు పక్కనున్న కాగితాలు రెపరెప లాడుతున్నాయి. రేవతిని నిద్ర లేపేందుకు వచ్చిన రాజ్యలక్ష్మమ్మ ఆ కాగితాలు తీసి చదివింది.

ఆమె కళ్ల వెంట నీళ్లు కారుతున్నాయి. సంవత్సరం క్రితం డాక్టర్ శరత్, “రేవతి షాక్‌కి గురయిందండీ! మనోజ్ లేడన్న విషయం ఆమెకి తెలియదు. చెప్పినా నమ్మదు. అప్పటినుండి ఆమె ఒక భ్రాంతిలో బతుకుతూంది. ఇతర అన్ని విషయాలలో మామూలుగానే ఉన్నా మనోజ్ మరణాన్ని ఆమె మెదడు స్వీకరించలేదు. ఆమెకి మళ్లీ చెప్పేందుకు ప్రయత్నిస్తే ప్రాణానికే ప్రమాదం రావచ్చు” నని చెప్పిన మాటలు ఆమె చెవుల్లో మారుమోగుతున్నాయి. పోగొట్టుకున్న మనవడిని కూడా మనవరాలిలోనే చూసుకుంటూ బతుకుతోంది.

కిటికీలో నుండి జారిన సూర్యుని నులివెచ్చని కిరణాల స్పర్శకి నిద్ర లేచిన మనవరాలిని దగ్గరికి తీసుకుంది రాజ్యలక్ష్మమ్మ.

★



## సూర్యకాంతానికి అంకితమిచ్చిన వెయ్యో నవల!

**ఆంధ్రదేశంలో** 1940-50 మధ్య కాలంలో యువతీ యువకులు విపరీతంగా ఇద్దరు రచయితల నవలలు నిత్యమూ చదువుతుండేవారు. వారి పేర్లు జంపన, కొవ్వలి. వీరిద్దరి పేర్లూ తెలియని, వారెవరైనా ఉంటే వారికి అక్షరజ్ఞానం లేదనుకోవాలి. లేదా చదివే అలవాటైనా లేదని భావించాలి. నేటి సినిమా హీరోల అభిమానుల్లా ఈ రచయితలకూ వేలాది అభిమాను లుండేవారు.

కొవ్వలి లక్ష్మీనరసింహారావు రాజరాజేశ్వరీ ఫిలిం కంపెనీ వారి ‘తల్లిప్రేమ’ [1941], వినోదా వారి ‘శాంతి’ [1952] చిత్రాలకు రచన కూడా చేశాడు. జంపన చాలా చిత్రాలకు రచన, దర్శకత్వం, కూడా వహించి కీర్తిగాంచాడు. కొవ్వలి ‘తల్లిప్రేమ’లో చిన్న పాత్రలో నటించాడు’ కూడా.

ఆ రోజుల్లో కొవ్వలి ఉదయం ఒక నవల రాయడం ఆరంభిస్తే రాత్రికి అది పూర్తి చేసేవాడని, పబ్లిషర్స్ అప్పుడు అర్థనూట పదహార్లు ఇచ్చేవారని, ఆ తర్వాత కాలంలో నూట పదహార్లు ఇచ్చేవారని ప్రజలు అనుకుంటుండేవారు.

కొవ్వలి రాసిన నవలలు, ప్రచురితమైనవి అప్పటికి వెయ్యి పూర్తి అయ్యాయి. వెయ్యో నవల ఆవిష్కరణ జరిపి, ఆ నవలను మన సినిమా అత్తగారైన సూర్యకాంతానికి అంకిత మిచ్చాడు. ఆ ఉత్సవాన్ని పెద్దలు, కవులు, రచయితల సమక్షంలో ఘనంగా జరిపారు.

ఇంతవరకు సంఖ్యా ముఖంగా వెయ్యి తెలుగు నవలలు రాసిన రచయిత కొవ్వలి తప్ప మరొకరు లేరు. ఈ విషయం గిన్నీస్ బుక్స్ వారికి తెలియజేసే వారు లేరు. లేకపోతే ఆయన పేరు ప్రపంచమంతటికీ తెలిసి ఉండేది!

సేకరణ: అరిపాక